183

# ఇరుకు ప్రపంచం

గిర గిరగిర గిరగిర గిరగిర....

నేలా-నీళ్లూ, గాలీ-ధూళీ, మబ్బూ-వానా, కొండా-కోనా, వాగూ-కా, చెట్టూ-చేమా, చెరువూ-దొరువూ, గొడ్డూ-గోదా, గడ్డీ-గాదం—గిర గిరగిర గిరగిర గిరగిర....

ఊరూ-నాడూ, పల్లే-పట్నం, మిట్టా-పల్లం, మేడా-గోడా—గిరగిర గిర గిరగిర గిరగిర....

ముసలీ-ముతకా, పిల్లా-పీచూ, గోచీ-గిన్నే, కొంపా-గంపా—గిరగిర గిర గిరగిర గిరగిర....

అందమైన ప్రపంచం

రంగురంగుల ప్రపంచం

వెండిపళ్లెంలో ఆపిల్ పండులాంటి ప్రపంచం

మట్టి మూకుడులో సంగటి ముద్దలాంటి ప్రపంచం

ఆకలికి చెమర్చిన పేదకుర్రాడి కనుగుడ్డులాంటి నున్నటి ప్రపంచం

పంతులుగారి బల్లమీద ఇరుసు కమ్మీలో—కుక్క నోట్లో కడిలాగ్రుక్కున్న గుండ్రటి ప్రపంచం

....బొంగరంలా తిరుగుతోంది

గిరగిర గిరగిర గిరగిర గిరగిర

గిరగిర...గిర... గిర....గి....ర....గి....ర....భూభ్రమణం ఆగిపోయింది!

ఆ గ్లోబువైపే కళ్ళప్పగించి చూస్తూ కూర్చున్న కుర్రాడొకడు—భూమిని హిరణ్యాక్షుడెత్తుకుపోతున్నట్లుగా తల్లడిల్లిపోతూ 'ప్రపంచం నిలిచిపోయింది!' అంటూ లేచి నిలబడ్డాడు.

వాడి జుత్తు పేరు కాకిగూడు. వాడి చొక్కా పేరు ప్రపంచ పట
వాడి నిక్కరు పేరు పోస్టాఫీసు. వాడి పేరు బాలయోగి.

పంతులు వాడివైపు చూచి, అన్నాడు. 'ఇది గ్లోబురా! తిప్పి
తిరుగుతుంది. తిరిగినంత సేపు తిరిగి, ఆగిపోతుంది. ప్రపంచం ఆగిపోలేద
అది యిప్పుడు కూడా తిరుగుతూనే ఉంది. కూర్చో. పాఠం రాయండిక.

బాలయోగి కూర్చున్నాడు. వాడికి పాఠం పూర్తిగా అర్థమయినట్లు
వుంది. పిసరంతయినా అర్థం కానట్లూ వుంది. బల్లమీద వున్నది ప్రపంచ
కాదని అనుకోవడానికి వాడి మనస్సు అంగీకరించలేదు.

దానిమీద మనిషి ఎంత వుంటాడు? చీమంత వుంటాడా?

అండమాన్, నికోబార్ దీవులే చీమలంత వున్నాయి.

మనిషి ఎంత వుంటాడు?

దుమ్ములా వుంటాడా?

వెయ్యిమంది మనుషులు చేరితే, దానిమీద దుమ్ములా వుంటారేమో

భారతదేశం గోరంత వుంది. అందులో యాభై ఆరు కోట్లమం
బతుకుతున్నారట! ఎంత విచిత్రం!....వాళ్లు సముద్రంలో పడిపోరూ?

ఈ గోళం చుట్టూ, దాదాపు నాలుగు వందల కోట్లమంది వున్నారట
నిజమేనా? ఈ మాట నమ్మదగిందేనా? నలభై మంది పిల్లలకే ఈ గది
చోటుచాలక ఒకరిమీద ఒకరు కూర్చుంటున్నారే—అన్ని కోట్లమందికి ఇం
చిన్న గోళం ఎలా సరిపోతుంది?

ప్రపంచంలో వున్నవాళ్ళందర్నీ బల్లమీదున్న గ్లోబుమీదికి తరిమి
ఎలా వుంటుంది? దానిమీద ఒక్కరు మాత్రం నిలబడవచ్చు. వాడి భుజా
మీద మరొకడు, వాడిమీద ఇంకొకడు, వాడిమీద....అలా....అలా..
అలా....అలా....

బాలయోగి తల పైకెత్తాడు. పై కప్పు కనిపించింది. వాడి చూపు
పై కప్పును చీల్చుకొని, ఆకాశాన్ని దూసుకుని, ఊహించలేనంత ఎత్తు

ెళ్లాయి. 'ఓరి నాయనోయ్! చివరివాడు స్వర్గలోకంలో వుంటాడేమో!' అనుకున్నాడు వాడు.

మళ్ళీ వాడి చూపులు భూలోకానికి దిగివచ్చి గ్లోబ్ మీద నిలిచాయి.

ఎంత యిరుకు ప్రపంచమబ్బా యిది!

ప్రపంచ భారాన్ని మోస్తున్న శేషాహిలా కుర్చీలో భారంగా కూర్చున్న ంతులుగారు పైకి లేచారు. ఏదో పనిమీద హెడ్మాష్టరుగారి గదిలోకి ెళ్ళారు.

పంతులు అనే బక్కపులి వెళ్ళిపోయింది.

పెద్దపులి బోనులో పడగానే అరాచకం పాలయ్యే అడివిలా తయా యింది తరగతి గది.

పీటలమీద పెళ్ళిలా పాఠాలు ఆగిపోయాయి.

పాటలోని వాద్యాల్లా కంఠాలన్నీ ఊగిపోయాయి.

నలభై కంఠాలు!

నాలుగు వందల కంఠాలు.

నాలుగు వందల కోట్ల కంఠాలు.

సంత?

జాతర!

పందుల గూడంత గదిలో ప్రపంచపు సంత!

ఆ మూల గారడీ! ఈ మూల ప్యారడీ!

అదిగో అక్కడ సర్కస్! ఇదిగో ఇక్కడ మిమిక్రీ!

మియ్యాంగ్! లవ్‌లవ్! ఈం....య్యం!

కథలూ కబుర్లూ

సినిమాలూ పాటలూ

వాణిశ్రీ నాగేశ్వర్రావ్—ఆరెరెరెరెరెరెరె ఎట్టాగో వున్నాది.

కృష్ణా సత్యనారాయణా—డిష్కుం డిష్కుం డిష్కుం
లే_లే-లే నా రాజా
డుబుక్కు డుబుక్కు డుబుడుబుక్కు డుబుడుబుక్కు
బుడుబుడుక్కు బుడుక్ బుడుక్కు బుడుబుడుక్
ఆ ఇ ఉణ్ బు ఇక్! అ ఇ ఉణ్ బు ఇక్!
బాబోయ్, ప్రపంచం నోరు విప్పింది!
చెవులు వినలేనంత ప్రళయం?
తుపాన్!
సైమూన్!
సైక్లోన్!
నయాగరా దూకుతోంది!
ఫ్యూజియామా పొగలు చిమ్ముతోంది!
ఐదు సముద్రాలు పోటెత్తి విరిగి పడుతున్నాయి!
ఆరు ఖండాలూ ఒకదాన్నొకటి మోదుకుంటున్నాయి!
మేజామీది గ్లోబును ఎవడో గిర్రున తిప్పేడు.
బాలయోగి కళ్లూ, చెవులూ గట్టిగా మూసుకున్నాడు.
ఒరే, పైనబడుతున్నావేంరా పందీ! జరిగి కూర్చో!
జరిగేందుకు చోటెక్కడుందిరా దున్నపోతూ!
చోటు లేకపోతే చావురా కుక్కా!
నన్ను కుక్కా అంటావుట్రా గాడిదా?
ఏమన్నావ్? చెంప పళ్ళు....
'ఛెళ్!'
ఏడుపు!

బాలయోగి కళ్ళు తెరిచాడు. చలికాలమైనా ఉక్కపోస్తూంది. పిల్లలంతా చొక్కాలు విప్పి విసురుకుంటున్నారు. బాలయోగి చొక్కా చెమటతో

ిడిపిపోయింది. వాడు చొక్కా తీసి రెండు చేతులతో రెండు కొసలూ ిట్టుకుని వీపుమీద చెమట తుడుచుకున్నాడు.

ఓ కుర్రాడు దొడ్డికి పోవడానికి తొందరపడిపోతున్నాడు. లేచి నిలబడి, ిక్కరు రెండు చేతులతో ఒడిసి పట్టుకున్నాడు. వాడు వెంటనే గది బయటకు ిళ్ళిపోవాలి. దారి ఎక్కడుంది? దారిచేసుకు పోవాలంటే చాలాసేపు పడు ిుంది. వాడు పిచ్చెత్తిన మదపుటేనుగులా అందర్నీ తొక్కుకుంటూ ుయటకు పరుగుతీశాడు. వాడి పరుగులో బాలయోగి తొడ నలిగిపోయింది. ొడ పట్టుకుని బాధతో మెలితిరిగిపోయాడు బాలయోగి.

అబ్బా!

కాలు మోపటానికి చోటు చాలని ప్రపంచం!

ఊపిరి పీల్చుకోటానికి గాలి చాలని ప్రపంచం!

అబ్బా! అయ్యో! ఈ ప్రపంచంలో బ్రతకటం ఎలా? చోటు ాలదు! గాలి చాలదు! ఉక్క! ఇరుకు! ఆఖరికి ఈ ప్రపంచం ుమౌతుంది? ఏమౌతుంది?....

ఓ కుర్రాడు రబ్బరు బుడగతో అందర్నీ వినోదింప జేస్తున్నాడు ానినిండా గాలి ఊది పైకి వొదుల్తున్నాడు. అది ఎగురుతూ తేలుతూ ిందికి వచ్చి పడుతూంది.

బాలయోగి చూస్తున్నాడు.

ఆ కుర్రాడు బెలూన్ నోటిదగ్గర పెట్టుకుని గాలి ఊదుకున్నాడు. రబ్బరు బుడగ క్రమంగా పెద్దదవుతూ వుంది.

'ఇంకా వూదు!' పక్కన కుర్రాడు.

బుడగ దోసకాయంతైంది.

'ఇంకా!'

పనసకాయ.

'ఇంకా!'

గుమ్మడికాయ.

బుడగ యిప్పుడు ప్రపంచంలా వుంది. మేజామీది గ్లోబుకం
పెద్దదిగా వుంది.

'ఇంకా!'

బాలయోగి కళ్ళూ, ముఖమూ కుంచించుకుపోయాయి. ఆఖరి
ప్రపంచం ఏమౌతుంది? ఏమౌతుంది?

'ఠాప్'

శూన్యం!

* * *

కాకులుదూరని కారడవి, చీమలు దూరని చిట్టడివిలాంటి ఇరు
సందులో వుంది బాలయోగి యిల్లు. బుట్టెడు ఖాళీ అగ్గిపెట్టెల్ని నేలమీ
కుమ్మరించినట్లుగా అడ్డదిడ్డంగా, కిందుమీదుగా వుంటాయి ఆ వీధిలో
యిళ్ళన్నీ! మనిషి ఆ వీధిలో వెళ్ళటం చూచినప్పుడు—రహస్యవీరుడ
సొరంగంలో దూరిపోతున్నట్లు, పాము పుట్టలోకి పాకుతున్నట్లు, గంద
తుమ్మెద దూలాన్ని తొలుస్తున్నట్లూ వుంటుంది. ఆ సందులో మరుగుజ్జ
వాళ్ళకోసం ప్రత్యేకంగా కట్టించినట్లుగా వుంటుంది, బాలయోగి వాళ్ళ యిల్లు

చుంచుపిల్లలా యింట్లోకి చొరబడిన బాలయోగి పుస్తకాల్ని ఓమూ
పడేశాడు. అప్పుడే తలదువ్వి జడవేసుకున్న ఆశాప్రియ పౌడరు డబ్బీ
బోర్లించి దబదబా బాది, కోపంతో దాన్ని వీధిలోకి విసరికొట్టి, మొంది అద్ద
చేతబట్టుకుని నుదుట బొట్టుపెట్టుకుంటోంది. ఎవరో తినిపారేసిన మొక్క
జొన్న కండెను నములుతూన్న ముసలిగొడ్డును చూస్తూ దిసమొలతో
గుమ్మంలో నిలబడ్డాడు, మూడేళ్ళ తమ్ముడు రాజా.

బాలయోగికి చచ్చేంత ఆకలిగా వుంది. 'అమ్మా, తింటానికేమైన
పెట్టవే....' అనే మాట నోటిదాకా వచ్చింది. అంతలో ఏడేళ్ళ చెల్లి రోజ
రమణి అడిగింది. 'అమ్మా! ఆకలిగా వుందే! అన్నంపెట్టూ!'

'కడుపా, అది చెరువా! తింటానికి వేళాపాళాలేదూ! దరిద్రపుముండా!
' అవతలికి!' అంటూ తల్లి దాని నెత్తిన ఓ మొట్టికాయ వేసింది. అది
ు తడుముకుంటూ వీధిలోకి పరుగుతీసింది.

బాలయోగి గూటిలో కెలికి బొంగరం చేతికి తీసుకున్నాడు. వెళ్ళి
ంగరం ఆడుకుంటే బాగుండును. బొంగరం తాడులేదు. ఎక్కడో
యింది. బహుశా అమ్మ లంగాకో, నాన్న అండర్ వేర్‌కో వుంటుంది.
త్తతాడు కొనుక్కోవాలంటే పదిపైసలు కావాలి. పదిపైసలు కావాలంటే,
వుడు ప్రత్యక్షం కావాలి.

వాడు ఆ బొంగరాన్ని మళ్ళీ గూట్లోనే పెట్టేశాడు.

ఆకలి!

అడగందే అమ్మయినా పెట్టదు.

అమ్మను అడగాలేకానీ, ఆకలి తీరేదాకా పెడుతుంది చీవాట్లు!

వాడు తిన్నగా వంటింట్లోకి నడిచాడు. 'ఏంరా!' అంటూ రోజా
మణిని చూచిన కళ్ళతోనే వాణ్ణికూడా చురచురా చూపింది తల్లి.

'ఏంలేదు.' అన్నాడు వాడు. కడవలో వీళ్ళు ముంచీ ముంచీ వరుసగా
లుగు లోటాలు తాగేశాడు. చివికిపోయిన పాత మొలతాడు పుటుక్కున
గింది. చొక్కా పైకెత్తి వంగి చూసుకున్నాడు. నిక్కరులోంచి తాడు
దికి వేలాడుతోంది. దాన్ని చేతికి లాక్కున్నాడు. వాడికి సంతోషం
సింది.

వెళ్ళి, తాడు లేకుండా గూట్లో పడివున్న బొంగరాన్ని మళ్లీ చేతికి
సుకున్నాడు. తెగిపోయిన మొలతాడును దానికి చుట్టాడు. తాడు చాలలేదు.
చాలీచాలని తాడుతోనే బొంగరం వేశాడు.

బొంగరం తిరిగింది గిరగిరమంటూ, తల్లకిందులుగా!

మేజామీది గ్లోబులా గిరగిరా తిరిగింది.

బాలయోగి తాడుచుట్టి మళ్లీ వేశాడు.

బొంగరం తిరిగింది- పేదవాడి బ్రతుకులా, చిత్రమైన ప్రపంచం తల్లకిందులుగా!

'ఛీ! ఈ తాడు పనికిరాదు!' అంటూ ఆ తాడును సైడుకాలవ గిరాటువేశాడు. బొంగరాన్ని గూట్లోకి విసిరేశాడు. గుమ్మంలోకివచ్చి, టకు వెడదామా, లోపలికి వెడదామా అని ఆలోచిస్తూ కొంతసేపు నిలబడ్డ

ఇంట్లో వుండాలంటే వాడికి తలనొప్పి, అసహ్యం. ఆ యిం వుంటున్నవాళ్ళు మనుషులుకాదు. పిరికిభూతాలు. వాళ్ళ ముఖాల్లో వె వుండదు. పీనుగుల్లా చూస్తుంటారు. పీనుగుల్లా తిరుగుతుంటారు. ఒక ఒకరు మాటామంచీ లేకుండా ఎవరికి వారు స్వంత ఆలోచనల్లో మునిగిపో మరమనుషుల్లా బ్రతుకుతుంటారు.

చెల్లీ, తమ్ముడూ బావురుమంటూ మార్చిమార్చి రాగాలు తీస్తుంట ఆశాప్రియ అదేపనిగా విసుక్కుంటూ వుంటుంది. దేశరక్షణ నిధిక వసూళ్ళకువచ్చి వేదికమీద నిలబడి చైనావాణ్ణి, పాకిస్తాన్‌వాణ్ణి గుక్క కోకుండా తిట్టిపోసే మంత్రి మహాశయుడిలా- అమ్మ తిట్లదండకం వల్లిస వుంటుంది.

ఇంట్లో యెవరో ఒకరు చచ్చిపోయి. మిగిలినవాళ్ళంతా దిగాల కూర్చున్నట్లు—భయంకరంగా వుంటుంది ఆ యింట్లో వాతావరణం. ర సాయంకాలాల్లో బడి వదలినతర్వాత చీకటిపడేదాకా బాలయోగి వీధుల తిరగటానికి కారణం ఇదే!

జలదారి తూముల్లో తిరుగాడే పందికొక్కులా—సందుగొందుల పడ్డాడు బాలయోగి.

ఒకచోట కొందరు పిల్లలు గోళీలు ఆడుకుంటున్నారు. ఖగోళ మల్లే చరాచరా దొర్లుకుపోతున్నాయి గోళీలు. గతితప్పిన గ్రహాలకు టకీటకీమంటూ ఒకదానికొకటి మోదుకుంటున్నాయి.

మరోచోట బొంగరాలాడుతున్నారు పిల్లలు. కలవారి బ్రతుకుల్లాగా— దర్జాగా తలెత్తుకు తిరుగుతున్నాయి బొంగరాలు.

బజారువీధిలోకి వచ్చాడు బాలయోగి.

నాగరిక జీవితానికి అవశ్యకములైన వస్తువుల జాబితాలాగా—చౌక దుకాణంముందర క్యూలాగా—దరిద్రుడి నిట్టూర్పులాగా—పాలులేని చంటి పాప ఏడుపులాగా—పొడుగ్గా వుంది బజారు. అంగళ్ళలో గల్లాపెట్టెల ముందర కూర్చున్న వర్తకుల అత్యాసలాగా—విశాలంగా వుంది.

రోడ్డు నిండా జనం! ఒడ్డును ఒరుసుకుంటూపారే ప్రవాహంలా కదిలి పోతున్న జనం! ఒకరినొకరు నెట్టుకుంటూ— తోసుకుంటూ— ఒరుసు కుంటూ—అడ్డుపడుతూ—పక్కకు తప్పుకుంటూ—ఆగుతూ—సాగుతూ- అయస్కాంతంవైపు ఆకర్షింపబడే ఇనుపసూదుల్లా అంగళ్ళవైపు అంగలు వేస్తున్న జనం!

నాలుగువైపులా కమ్ముకున్న జనం రద్దీలో బాలయోగి పాదం నలిగి పోయింది.

మేజామీది గ్లోబు గిరగిర తిరుగుతూ కళ్ళముందు నిలిచింది.

....ఇరుకు ప్రపంచం!

రెండోపాదం మోపటానికి చోటులేని ప్రపంచం!

ఈ జనమంతా యెక్కడికి పోతున్నారు? ఎందుకు పోతున్నారు?

నీటిలో గాలంవేసి ఏటి ఒడ్డున కూర్చున్న బెస్తవాళ్ళలాగా—దొంగ జపంచేస్తూ వుంచున్న కొంగల్లాగా—నట్టడవిలో చిక్కుకున్న పరదేశిచుట్టూ చేతులు కూర్చుకుని నృత్యంచేసే నరమాంసభక్షకుల్లాగా— రోడ్డుకు యిరు వైపులా అంగళ్ళు!

అంగళ్ళు! అంగళ్ళు! అంగళ్ళు! అంగళ్ళు!

హోటల్ ముందర నిలబడ్డాడు బాలయోగి.

హోటల్‌నిండా జనం— లోపలికి వెడుతూ— బయటికివస్తూ— కుర్చీల్లో కూర్చుంటూ—కుర్చీలకోసం నుంచుంటూ—తింటూ—తాగుతూ— సర్వర్లను పురమాయిస్తూ— త్రేన్చుతూ— చేతులు కడుక్కుంటూ— బిల్లు చెల్లిస్తూ....

....కడుపులో పేగులు కుయ్యిమన్నాయి.

తోటరాముడిమీద కలవరం పెట్టుకుని పుల్లలా చిక్కిపోయిన రాకుమారి పాత ఒడ్డాణం పెట్టుకుంటే ఎలా దిగజారిపోతుందో, అలా కిందికి జారింది బాలయోగి నిక్కరు. వాడు దాన్ని పైకి లాక్కుని మెలితిప్పి ముడి వేసుకుని, ముందుకు నడిచాడు.

బట్టల దుకాణాలముందు రకరకాల బట్టలు ఇంద్రధనుస్సుల్లాగా వేలాడుతున్నాయి. నాణ్యమైన చీరలకోసం ప్రాణాలిచ్చేసిన సుందరీమణుల్లాగా—అందమైన బొమ్మలు రంగురంగుల చీరల్లో బందీలై నుంచున్నాయి.

....ఇదిగో కిరాణాకొట్టు! మూటలు మూటలు! రాసులు రాసులు!

ఒకడు బస్తా బియ్యం కొంటున్నాడు. మరొకడు అరపడి సన్నసూకలు కొంటున్నాను.

ఒకడు డబ్బా నూనె కొంటున్నాడు. మరొకడు 'పావలా నూనియ్యి బాబూ!' అని గంటపేపట్నుంచీ ఘోషిస్తున్నాడు.

ఒకడు పదిశేర్ల పప్పు కొలవమంటున్నాడు. మరొకడు పడి ఉప్పు అడుగుతున్నాడు.

సెట్టిగారు ఒకడికి కుర్చీచూపి కూచోమంటున్నాడు. మరొకణ్ణి 'కావే పాగు' అని కసురుకుంటున్నాడు.

....ఫ్యాన్సీ షాపుముందర నిలబడ్డాడు బాలయోగి.

బొంగరం తాడు కొనుక్కుంటే బాగుణ్ణు! పదిపైసలు!....దేవుణ్ణడగాలి! దేవుడి దగ్గిర వుందో, లేదో!

స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు-ప్లాస్టిక్ సామానులు- పౌడరు డబ్బీలు—స్నో సీసాలు—టూత్ పేస్టులు—టూత్ బ్రష్‌లు — హేరాయిల్ సీసాలూ తిలకం బుడ్డీలు - నైల్ పాలిష్‌లు—జడకుచ్చులు— బ్రాసరీలు — సెంటు బుడ్డీలు —సిగరెట్ ప్యాకెట్లు....

వాటికోసం ఎగబడుతున్నారు జనం. అది కావాలి, ఇది కావాలి అంటూ తలారి రాముడి సంతానంలా ముసురుకుంటున్నారు.

కొట్టుముందర తొక్కిసలాడుతూన్న గుంపులోంచి ఓ గుండ్రటి నాణెం టింగుమంటూ అరుగుమీదపడి, అక్కణ్ణుంచి రోడ్డుమీదపడి, చితికిపోయిన గోళంలా—శీల వూడిన బండి చక్రంలా దొర్లుకుంటూ వచ్చి శరణు మహాప్రభో అంటూ బాలయోగి పాదాల నడుమ కూలిపోయింది.

బాలయోగి కళ్లు రెండూ కొత్త అర్ధరూపాయి బిళ్ళలా మెరిశాయి.

అది అర్ధరూపాయి బిళ్ల! దేవుడు పంపాడు!

వాడు చుట్టూ చూశాడు. ఎవరూ గమనించలేదు.

కొట్టు ముందరున్న గుమ్మంవైపు చూశాడు.

ఎవరూ వెదుక్కోవటంలేదు.

కాస్సేపు అలాగే విలబడ్డాడు బాలయోగి.

ఎవడు పారేసుకున్నాడో, పాపం! ఈ అర్ధరూపాయితో వాడు ఏదో ఒక దండగ వస్తువును కొన్నా ఒకటే. ఈ అర్ధరూపాయిని పోగొట్టుకున్నా ఒకటే!

బాలయోగి వంగి ఆ నాణెం చేతి కందుకున్నాడు.

వాడి గుండెలు గుబగుబమన్నాయి. వెనక్కి తిరిగి గబగబా అంగలువేస్తూ యింటిదారి పట్టాడు.

ఈ డబ్బును ఏం చెయ్యాలి?

చిల్లర మార్చి యాభై మంది బిచ్చగాళ్ళకు యాభై పైసలు దాన చేద్దామా?

వాళ్ళకేం, మహారాజులు! ఒక్కొక్క పైసా చొప్పున అడుక్కుంటూ పొద్దుపోయేసరికి రెండు రూపాయలన్నా సంపాదిస్తారు? తను అడుక్కో లేదుకదా? తనకెవరిస్తారు యాభై పైసలు? తాను వాళ్ళకు దానం చేస్తే ఎం చెయ్యకపోతే ఎంత?

ఊళ్లో మంచి సినిమా ఆడుతోంది. కలర్ పిక్చరు! ఎక్కడెక్కడ ఆడి, ఇప్పు డీ వూరొచ్చింది. అందులో వాణిశ్రీ వుంది. నాగేశ్వర్రా న్నాడు. నాగభూషణం వున్నాడు, అల్లు రామలింగయ్య వున్నాడు. రమాప్ర వుంది. రాజబాబున్నాడు. భలేభలే పాటలున్నాయి.

సినిమాకు వెడితే?

ఔను. సినిమాకే వెళ్ళాలి! చూచిన వాళ్ళంతా మళ్ళీ మళ్ళీ చూ న్నారు. తాను ఒక్కసారైనా చూడకపోతే ఎలా? చూడాల్సిందే!

బాలయోగి నడక వేగం హెచ్చించాడు.

వాడి ఆలోచన బొంగరం తాడుమీదికి వెళ్ళింది.

బొంగరం తాడు కొనుక్కుంటే, సినిమాకు డబ్బు చాలదు. వద్దు సినిమాకే వెళ్లాలి.

గంట మోగిస్తూ మిఠాయి బండి ఎదురుపడింది. లడ్డూలు! మైసూ పాకులు! హల్వా! బాదుషా! కారాలు! పకోడీలు!.... నోట్లో నీళ్ళూరింది.

'పకోడీ పొట్లం ఒకటివ్వు' అని నోటిదాకా వచ్చినమాట, నోట ఫూరిన నీళ్ళల్లో కరిగిపోయింది.

పకోడీలు కొనుక్కుంటే, సినిమాకు డబ్బు చాలదు. వద్దు! సినిమా వెళ్లాలి.

నాన్నకొచ్చే జీతంలో అన్నీ రావుకదా? అలాగే ఈ అర్ధరూపాయి అవ్వా బువ్వా అన్నీరావు. ఏదో ఒక్కటి మాత్రమే!

'టైమెంత సార్?'

'ఆరూ, పది!'

'ఓ యబ్బో! సినిమా మొదలవటానికి యింకా బోలెడంత టైముంది. ఫరవాలేదు.

'బూచాడమ్మా బూచాడు—బుల్లి పెట్టెలో వున్నాడు.'

* * *

బాలయోగి యింటిని సమీపించేసరికి సంజచీకట్లు ముసురుకుంటు న్నాయి—కన్నెపిల్లల గుండె తలుపులుతట్టే చిలిపి కోరికల్లా. తెరలుతెరలుగా.

కిటికీ దగ్గర స్టూలువేసుకుని వీధిలోకి చూస్తూ కూర్చుని వుంది ఆశాప్రియ.

సంజచీకట్లు అంటే ఆమెకు చెప్పలేనంత యిష్టం. నిద్ర లేచినప్పటి నుంచీ సంజవేళకోసం ఎదురుతెన్నులు కాస్తూ వుంటుందామె.

ఆమెకు పద్దెనిమిదేళ్ళ పడుచుదనం వుంది. ఆ పడుచుదనాన్ని ముస్తాబు చెయ్యాలన్న కోరిక కొండంత వుంది. అయితే ముస్తాబు చేసుకో టానికి ఏమీలేదు. ఆమెకు ముక్కు బోసి, మెడ బోసి, చెవులు బోసి, చేతులు బోసి. బట్టలు మాత్రం రెండే రెండు జతలున్నాయి. అవి కూడా చిరిగి పోయి, మాసికలు కుట్టినవి. తలకు చమురు ఒకప్పుడు వుంటుంది. ఒకప్పుడు వుండదు. ఫేస్ పౌడరు కూడా అంతే!

అయినా, సంజవేళ ఆ కిటికీ దగ్గర అలా కూర్చునే ముందు 'ముస్తాబు' చేసుకోవటం మాత్రం మానదు ఆశాప్రియ. ముఖం రుద్దు కుంటుంది. తల దువ్వుకుని, రంగువెలిసిన రిబ్బనుపెట్టి జడ వేసుకుంటుంది. నీళ్ళతో పిండి ఆరబెట్టుకున్న వోణీ పైన వేసుకుంటుంది. నుదుట బొట్టు పెట్టుకుంటుంది. చెరిగిపోని బొట్టులాగా - చెదిరిపోని ముంగురుల్లాగా - కిటికీ దగ్గర కదలకుండా కూర్చుంటుంది.

అలా కూర్చున్నప్పుడు—చెల్లి ఏడుస్తున్నా. తమ్ముళ్ళు అల్లరిచేస్తున్నా. తల్లి రుసరుసలాడుతున్నా. ఇంటి కప్పులు కూలి నెత్తిన పడబోతున్నా పట్టించుకోదు. అలంకారాలకు, ఆభరణాలకు నోచుకోని శరీరంలో మణి

దీపాల్లా అమరిన చారెడు కళ్ళతో వీధిలోకి - అమ్మవారి విగ్రహంలా రెప్ప లార్పకుండా చూస్తూ వుంటుంది.

వీధిలో కోరమీసాల కోడెవయసు చిన్నవాళ్ళు వెడుతుంటారు. ఆ కిటికీ ముందునుంచి.

కన్నార్పకుండా చూసేవాడొకడు.

కూనిరాగం తీసేవాడొకడు.

ఈలపాట పాడేవాడొకడు.

పెదవుల ధనుస్సులో నవ్వుల బాణాలు సంధించేవాడొకడు.

కన్నుగీటేవాడొకడు.

గాలిలో ముద్దులు వెదజల్లేవాడొకడు....

ఆశాప్రియ మూతి ముడుచుకోదు. అలా అని ముఖం చేటంత చేసుకోదు.

వాళ్ళ అల్లరి అంటే ఆమెకు ఎంతో ఇష్టం!

అమృతం—ఆ యింటి ఇల్లాలు—అల్లరిచేసే అబ్బాయిల్ని చూస్తూ మొద్దులా కూర్చున్న కూతుర్ని, దీపంపెట్టి శపిస్తూ వుంది. 'సిగ్గూ శరం లేని ముండ! బోగందానిలా ఆ కిటికీ దగ్గర అలా కూర్చోటం ఏమిటీ, ఆ చూపులేమిటీ? ఏండ్లొస్తే సరిపోయిందీ, గాడిదకొచ్చినట్లు? అక్కణ్ణుంచి లేచొస్తుందా చూడూ....'

తల్లి అలా చీవాట్లు పెడుతూంటే, ఆశాప్రియ కిటికీ దగ్గరనుంచి లేవబోయింది. కిటికీవైపు మళ్ళీ ఓమారుచూచి, తల్లి చీవాట్లను గాలికి వొదిలేసింది. నిట్టూరుస్తూ మూగబొమ్మలా కూర్చుంది.

వాకిట్లో నిలబడ్డాడు బాలయోగి. బయటినుంచే 'అమ్మా, అమ్మా!' అని పిలిచాడు. కిటికీవైపు తొంగిచూచి 'అక్కా! నేను సినిమా కెళ్తున్నాను. అమ్మతో చెప్పు!' అనేసి యింకో మాటకోసమైనా ఆగకుండా తారాజువ్వలా పరుగందుకున్నాడు.

సినిమా కెళ్తున్నానని అమ్మతో ముందుగా చెప్పినా ప్రమాదమే। చెప్పక పోయినా ప్రమాదమే।

చెప్పకుండా వెళ్తొస్తే, 'చెప్పకుండా ఎందుకు వెళ్లావ్?' అని మూతి మీద పొడిచినా పొడవ్వచ్చు।

ముందుగా చెబితే, 'డబ్బెక్కడిదీ? ఇలా తే!' అని లాగేసుకున్నా లాగేసుకోవచ్చు।

అందుచేత, నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అని పుస్తకంలో రాసినట్లు—'అమ్మా, సినిమాకెళ్తున్నా' నంటూ ఆకాశవాణిలా కేకేసి, గుమ్మంలోనే అంతర్ధానమై పోయాడు' బాలయోగి.

మాంసం దొంగిలించిన కుక్కలా పరిగెత్తి, సినిమారోడ్డు అందుకున్నాడు.

అన్ని రోడ్లకంటే వెడల్పుగా వుంది సినిమారోడ్డు. సినిమాకు జనం గుంపులు గుంపులుగా—రోడ్డు పట్టనంత రద్దీగా వస్తారనో ఏమో—అది అంత వెడల్పుగా ఉంది।

బాలయోగి యాంత్రికంగానే నడుస్తూ సినిమాథియేటర్ చేరుకున్నాడు. సినిమా బుకింగ్ దగ్గర టిక్కెట్లకోసం ఎగబడుతూన్న జనసందోహాన్ని చూడగానే, వాడి ఆశ నీరుగారిపోయింది.

తేనెటీగల్లా కమ్ముకున్న జనంలో కౌంటర్ ఎక్కడుందో కనిపించటం లేదు. ఒక్కచేయి మాత్రమే పట్టే ఆ కౌంటర్ కంత ఎలా వుంటుందో? అందులో ఇప్పుడు నాలుగైదు చేతులు ఇరుక్కుపోయి వూడిరావటానికి గంటాలు పడుతుంటాయేమో!

రద్దీకి దూరంగా నిస్సహాయంగా నిలబడ్డాడు బాలయోగి.

తోసుకుంటూ—తొక్కుకుంటూ—కుమ్ముకుంటూ—కొట్టుకుంటూ-నెట్టుకుంటూ—తిట్టుకుంటూ పంచెలు జార్చుకుంటూ—చొక్కాలు చింపుకుంటూ - జుత్తు పీక్కుంటూ-చొంగలు కార్చుకుంటూ-చెప్పులు తెంపుకుంటూ-చెమటలు కార్చుకుంటూ-భుజాల మీద నడిచిపోతూ-పిట్ట గోడమీది కెగ

బ్రాకుతూ ప్రాణాలను పణంగా పెట్టి, టిక్కెట్లకోసం విరగబడి పోతున్న జనం!

బలం వుంటేనే బతుకు!

బలం లేనివాడు పుడమితల్లికి కడుపుచేటు!

నాలుగు థియేటర్లు నింపటానికి సరిపోయేటంత జనం-ఒకే థియేటరు దగ్గర మోహరించి విజయమో, వీరస్వర్గమో తేల్చుకోటానికి తలపడుతున్నారు.

మనిషిలో ఆశ రెచ్చిపోతే, వివేకం చచ్చిపోతుంది. టిక్కెట్టుకోసం ప్రయత్నం చెయ్యాలనుకున్నాడు బాలయోగి. అర్థరూపాయి నాణెం చేత్తో పట్టుకుని, వెళ్ళి—గుంపువెనక నిలబడ్డాడు.

గుంపులోకి చొచ్చుకుపోవడం సాధ్యం కాలేదు. కొండకొమ్మును తాకి పక్కదారిపట్టే పిల్లగాలిలా గుంపుచుట్టూ గింగుర్లు తిరిగాడు. కొండను ఢీకొనే పొట్టేలులాగా మళ్లీ ముందుకు కదిలాడు. ఎగురుతూ వెళ్ళి, అడ్డొచ్చిన రాతి గుండును అంటుకుని ఆగిపోయే జిల్లేడుగింజలా- కాళ్లు నేలకు తన్ని గుంపును అంటిపెట్టుకున్నాడు. గుంపు ఒక్కుమ్మడిగా ముందుకు కదిలింది. బాలయోగి ముందుకు తూలాడు. ఒళ్లు విరుచుకున్న రాక్షసిలా గుంపు మళ్ళీ వెనక్కి వేగంగా కదిలింది. బాలయోగి కాళ్ళు నలిగిపోయాయి. వెనక్కి కదిలిన గుంపు వాణ్ణి వెనక్కి-వెనక్కి-వెనక్కి నెట్టివేసింది.

చావుతప్పి కన్ను లొట్టపోయి, దూరంగా వెళ్ళి నిలబడ్డాడు వాడు. చంద్రుడులేని ఆకాశంలా వెలవెలబోతూ వుంది వాడి చేయి. ఆ చేతిలో అర్ధరూపాయి నాణెం లేదు. గుంపులో జారిపోయింది.

ఆ అర్ధరూపాయిని మళ్లీ చేజిక్కించుకోవడం యెలా? వెళ్ళి వెతికితే, గుంపు వెతుక్కోనిస్తుందా? 'మేం తొక్కులాడుతూ వుంటాం, నువ్వు వెతుకులాడుతూ వుండు' అంటారు వాళ్ళు. ఎవరి పని వాళ్లు చేసుకోవటానికి అభ్యంతరం ఏముంది?

అయితే, ఆ గుంపులో దూరి, వాళ్ళ పాదాలకింద యెక్కడో కూరుకు
ోయిన ఆ అర్ధరూపాయిని వెతికి తేవటం హనుమంతుడికైనా చేతకానిపని.

థియేటర్‌లో పై కప్పులు తగిలేవరకు జనాన్ని కుక్కి, బుకింగ్
ూసేశారు. గేట్లు మూసేశారు. సినిమాల్లో కూర్చున్నంతమంది గేటు
యటే మిగిలిపోయారు. యుద్ధంలో చిత్తుగా ఓడిపోయినవాళ్ళలాగా తలలు
ేసుకుని, ఆకల ఊపిరిపోయి పీనుగులైపోయిన గుండెల్ని మోసుకుంటూ
పరిసరాలను విడిచి వెళ్ళిపోయారు. వెళ్ళిపోతున్నవాళ్ళను చూచి నవ్వుతూ
ంచున్నారు, వాల్‌పోస్టర్లలో వాణిశ్రీ, నాగేశ్వరరావులు.

బాలయోగి కౌంటర్ ముందర అటు పదిగజాలు. ఇటు పదిగజాలమేర
మ్ములో కెలికాడు. అంగుళంమేర కూడా విశచిపెట్టకుండా ఓపిగ్గా అర
ంటసేపు వెతికినా, అర్ధరూపాయి కనిపించలేదు. ఏమైపోయింది? ఉంటుంది!
క్కడే! ఈ దుమ్మంతా బండికెత్తించి ఇంటికి తీసుకుపోయి జల్లెడ పట్టిస్తే,
ప్పుడు దొరుకుతుందేమో!

వాడు వెతకడం విరమించుకుని, చేతులు దులుపుకున్నాడు.

సినిమాకి టిక్కెట్టు దొరికివుంటే బాగుండేది.

అసలు సినిమాకే రాకుండా వుంటే బాగుండేది. ఆ అర్ధరూపాయికి
ంగరంతాడు, పకోడీ పొట్లం కొనుక్కుని వుంటే బాగుండేది.

ఆ అర్ధరూపాయి దొరక్కుండా వుంటే ఎంత బాగుండేది? అది
ొరికిన డబ్బేగా? ఎలా దొరికిందో అలాగే పోయింది. ఇదే బాగుంది!

వాడు సినిమా పోస్టర్లవైపు చూస్తూ, సినిమాలోంచి సన్నగా వినిపి
స్తున్న మాటలూ పాటలూ వింటూ మరో అరగంట అక్కడే గడిపాడు.

ఇప్పుడు తెరమీద ఏం జరుగుతూవుంటుంది?...పాట వినబడుతూ
ంది. వాణిశ్రీ మగాడిలా చంకలెగరేసి ఆడుతూ వుంటుంది. నాగేశ్వరరావు
డపిల్లలా నడుం తిప్పుతూ ఆడుతుంటాడు. వాళ్ళ ఆటలూ, వాళ్ళ పాటలూ
ాడాల్సిందే! సినిమాతెరమీద వాళ్ళిద్దరూ తిరిగే ప్రపంచం ఎంత విశాల
ినది! సినిమా కౌంటర్ దగ్గర వుండిన రద్దీ, తొక్కిసలాట అక్కడలేవు.

విశాలమైన మైదానాలు! సుందరమైన నందనవనాలు! ఒకరికొకరు దొర కృండా యింట్లోనే పరుగులు తీయటానికి చాలినంత పెద్దపెద్ద మేడలు! ఆ మేడల్లో-ఆ ఉద్యానవనాల్లో- ఆ మైదానాల్లో వాణిశ్రీ, నాగేశ్వర్రావూ తప్ప మరెవ్వరూ కనిపించరు. ఈ రద్దీ, ఈ ఇరకాటం, ఈ గిలగిల, ఈ విలవిల-అక్కడ మచ్చుకైనా లేవు. అది మరో ప్రపంచం. మన ప్రపంచానికంటే లక్షరెట్లు పెద్ద ప్రపంచం. అందులో కనిపించే ఆ యిద్దరూ ఆకలిదప్పులను గురించి ఎప్పుడూ పట్టించుకోరు. ఎప్పుడూ ఆటలే! ఎప్పుడూ పాటలే! వాళ్ళకు నవ్వులుగానీ, ఏడ్పులు లేవు. అథవా ఎప్పుడయినా ఏడిస్తే, ఆ ఏడుపు కూటికోసంకాదు, గుడ్డకోసంకాదు, బ్రతకటానికి చోటులేదనికాదు. ఎడబాటు సహించలేక!.... వాళ్లకు ఓ బుల్లి పాపాయి వుంటాడు. వాడికేం తక్కువ? అదృష్టమంటే వాడిదేకదా?

ఆ మరో ప్రపంచంలో జీవితాన్ని ఊహించుకోవడమంటే బాలయోగికి యెంతో సరదా. తాను ఆ వాణిశ్రీ కడుపులో పుడితే యెంత బాగుణ్ణు! వాణిశ్రీ ఒడిలో మురిపెంగా కూర్చుని, నాగేశ్వరర్రావు ముక్కుపట్టుకుని లాగొచ్చు!....ప్చ్! బ్రతుకు సినిమాకాదుగదా!

వాల్‌పోస్టర్‌లోని వాణిశ్రీ, నాగేశ్వర్రావూ వాడివైపు జాలిగా చూశారు. బాలయోగి మురిసిపోయాడు.

సైరన్ 'గుయ్యి' మంటూ కూత పెట్టింది.

గంట ఎనిమిదయిందన్నమాట.

ఆకలి పంజా విప్పుకుంటోంది.

చలి గోళ్ళకు పదును పెట్టుకుంటోంది.

బాలయోగి ఇంటిముఖం పట్టాడు.

బస్‌స్టాండ్‌లోంచి తలకుమించిన బరువును మోసుకుంటూ చివరి బస్సులు కదిలి వెళ్ళిపోతున్నాయి. బస్సులనిండా జనం! వెళ్లిపోతున్న బస్సుల వైపు చూచి నిట్టూరుస్తూ—బస్‌స్టాండ్ నిండా జనం!

* * *

తలుపు మూసి వుంది.

బాలయోగి వాకిట్లో నిలబడి మెల్లగా తలుపు తట్టాడు.

'కంచాలెందుకురా అలా కొడతారు? ఈ చట్టీతీసి నెత్తిమీద ...'
మృతం గొంతు హఠాత్తుగా ఆగిపోయింది, కట్ అయిపోయిన సినిమా
గా; నిశ్శబ్దం ఆ యింటి గొంతుకనే నొక్కేసింది.

'టక్-టక్-టక్-టక్ ....'

తలుపు తెరుచుకోలేదు.

బాలయోగి ముందుకు వంగి తలుపు సందులోంచి లోపలికి చూశాడు
కిలికి నేరుగా వున్న వంటగదిలో ఖాళీ కంచాల ముందు కూర్చుని వున్నారు
జారమణి, రాజా. అమృతం తలుపువైపు చూస్తూ, చేతిలో చట్టితో
లబడి వుంది.

'టక్-టక్-టక్-టక్ ....'

'ఎవరూ?' అంది అమృతం.

'టక్-టక్-టక్-టక్ ....'

ఆమె చట్టి కిందపెట్టి తిన్నగా నడిచి వచ్చింది. తలుపు తీసి పక్కకు
దిగి నుంచుంది.

బాలయోగి లోపలికి దూరాడు.

'ఓరి కొరివి దెయ్యం! నువ్వా!....అప్పులవాళ్ళేమోనని హడలి
చ్చాను. మూగెద్దులాగా అలా తలుపు కొట్టకపోతేనేం? నోరు లేదూ నీకు?'
ంటూ వాడి తలమీద లాగి మొట్టికాయ వేసి మళ్ళీ తలుపు మూసింది
మృతం.

ఆ యింటికి సాయంకాలంనుంచీ తీర్థప్రజలాగా వచ్చి వెళ్తున్నారు
ప్పులవాళ్ళు.

పెద్ద అప్పులవాళ్ళు బెదిరించి వెళ్ళారు.

చిన్న అప్పులవాళ్ళు చీవాట్లుపెట్టి వెళ్ళారు.

ఇల్లు ఖాళీ చెయ్యండని యిప్పుడే చెప్పి వెళ్లాడు, ఇంటద్దెవాడు.

అన్నీ విని చచ్చిన పీనుగులా వూరుకుంది అమృతం.

ఆమెకంటే చచ్చినపీనుగే మేలు!

పీనుగు పువ్వులు కురిశాయని పొంగిపోదు, ముళ్ళు గుచ్చుకున్నాయని కృంగిపోదు.

పూలవాన లేకపోతే పీడపోయింది, ముళ్ళు గుచ్చుకుంటే తుళ్ళిపడకుండా వుండదే ఈ వెధవ ప్రాణం!

'ఏం, సినిమాకు పోతానన్నావే - పోలేదా?' అని అడిగిందామె కొడుకును.

'లేదు,' అన్నాడు బాలయోగి.

'డబ్బెవరిచ్చారు?'

'బజార్లో దొరికింది, అర్ధరూపాయి.'

'ఏదీ, యిలా యివ్వు!' అంటూ చేయి జాచిందామె.

'ధారపోయింది!'

చాచిన చేత్తోనే మళ్లీ ఓ మొట్టికాయ వేసింది అమృతం. 'కాళ్ళు కడుక్కుని రా, కడుపు చించుకుందువుగానీ!' అంది.

కాళ్ళు కడుక్కుని వచ్చి కంచం ముందు కూర్చున్నాడు బాలయోగి.

చింకి చాపను వొదిలితే జీవించలేనన్నట్లు పడుకుని వుంది ఆశాప్రియ.

'నువ్వూ లేచి రావే! ఒక కడి నోట్లో వేసుకొందువు....' అని కేకేసింది అమృతం.

'నాకొద్దు. ఆకల్లేదు' అంది ఆశాప్రియ.

ముందరున్న సంగటి చట్టిలోకి తొంగిచూశాడు బాలయోగి. అందులో ఒకటిన్నర ముద్ద సంగటి వుంది! ఒక ముద్ద భూగోళం! అర ముద్ద చంద్రగోళం! తాకి చూచాడు, చల్లగా వుంది.

'మధ్యాన్నం చేసిందా?' అని అడిగాడు.

'ఏం? గొంతు పట్టుకుంటుందా? చెయ్యి తియ్!' అంటూ కసిరింది
ృతం.

ఆమె భూగోళాన్ని చేతికి తీసుకుంది. దాన్ని మూడు ముక్కలు చేసి
ఏరి కంచాల్లో పంచింది. చింతపండు పచ్చడి వేసింది. అవురావురుమని
ృడు బాలయోగి. ఆకలి తీరలేదు.

భూగోళం ముగ్గురికి చాల్లేదు!

ఒకడికి సరిపోతుంది. ముగ్గురికి చాలదు.

కోటి మందికి సరిపోతుంది. మూడు కోట్ల మందికి చాలదు.

నూరు కోట్లమందికి చాలుతుంది. మున్నూరు కోట్లమందికి చాలదు.

చాలదంటే అమ్మ తిడుతుంది. తిట్టినా ఇంకొంచెం పెడుతుంది.
ంతే మిగిలివున్నది చంద్రగోళమే కదా? అమ్మ, నాన్న, అక్కయ్య
ందరూ దాన్నే పంచుకోవాలి గదా!

బాలయోగి చెయ్యి కడుక్కున్నాడు.

చంద్రగోళాన్ని తీసి మూకుట్లో దాచిపెట్టింది అమ్మృతం. సంగటి
ో నీళ్ళుపోసి గోకి, ఉప్పువేసి కలిపింది. లోటాలోకి వొంచి, 'దీన్ని
ూకివ్వరా బాలిగ!' అంది.

'నాకొద్దురా! తీసుకుపో!' అంది ఆశాప్రియ.

అమ్మృతం ఆ రెండు లోటాల నీళ్ళూ గుటగుటా తాగేసి, కుండలూ
ాలూ కడిగిపెట్టింది.

పిల్లలంతా పడుకున్నారు.

చింకిచాపలు పరుచుకుని, చింకిపేలికలు కుక్కిపెట్టిన తలగడలు
ుకుని, చింకిదుప్పట్లు కప్పుకుని పడుకొంటారు ఆ ఇంట్లో అందరూ!
ుట్లు అందరికీ చాలినన్ని లేవు గనుక పాతకోకలు గూడా కప్పుకొంటారు.

పడుకుంటే ఆ యిల్లు అందరికీ యిరకాటం!

చక్రపాణి ఈమధ్య యింట్లో పడుకోవటంలేదు. వాడసలు యింట్లో బొత్తిగా వుండడమేలేదు. ఎప్పుడో వస్తాడు. వచ్చినవాడు వచ్చినట్లే ఎక్కడికో వెళ్లిపోతాడు.

తొమ్మిదో తరగతి పూర్తి కాకుండానే, చదువుకు సున్న పెట్టాడు చక్రపాణి. ఆకలి తీరని కడుపుతో, అసహ్యమైన బట్టలతో, నైరాశ్యం నిండిన కళ్ళతో, న్యూనత నిండిన మనస్సుతో వాడు బడికి వెళ్ళలేకపోయాడు. తప్పుదార్లు తొక్కాడు. పేకాటగాళ్ళకు, తాగుబోతులకూ నమ్మిన బంటయ్యాడు.

అన్నయ్యకు అలా అంబోతులా ఊరుమీద తిరిగే అలవాటు లేనప్పుడు ఈ యిల్లు యింతకంటే యిరకాటంగానే వుండేది.

బాలయోగి, రోజారమణి, రాజా—వరసగా ఒకే చాపమీద పడుకుంటారు. ముగ్గురూ ఒకే దుప్పటి కప్పుకుంటారు.

రాజా అప్పుడే నిద్రపోయాడు.

రోజారమణి కళ్లమీద యిప్పుడిప్పుడే నిద్ర ముసురుకుంటోంది.

బాలయోగి కళ్ళు—తొక్క వొలిచిన అరటిపండులా విచ్చుకునే వున్నాయి.

గోడమీద మేకుకు తగిలించిన కోడిగుడ్డు దీపం అర్ధాకలితో నీరసంగా వెలుగుతోంది.

ఆ ఇంట్లో కరెంటు లైట్లు లేవు. కరెంటు లైట్లకంటే మరెంతో అవసరమైనవీ, వాళ్లకు అందుబాటులో లేనివీ—లెక్కపెట్టలేనన్ని। కనుక వాళ్లకు కరెంటు దీపమైనా ఒకటే. కిరసనాయిలు ధూపమైనా ఒకటే।

నాన్న యింకా రాలేదు. జీతాల రోజున అర్ధరాత్రి దాటితేగానీ యింటికి రాడు నాన్న, అప్పులకు భయపడి।

అమృతం గోడవైపు తిరిగి నుంచుని కిందికీ పైకీ చూస్తూ ఏమిటో గొణుక్కుంటోంది.

గోడలనిండా పెన్సిల్ గీతలు—మమ్మ నేలమీద బాతుల గుంపు
పోయిన గుర్తుల్లాగా!

ఆమెకో పాత పెన్సిల్ ముక్క వుంది. దాన్ని ఎవ్వరూ తాకరు.
వంటింటి గూట్లో భద్రంగా వుంటుంది. ఆమె తన సంసారభారాన్నంతా
టికప్పుడు ఆ యింటి గోడలమీది కెక్కిస్తూ వుంటుంది ఆ పెన్సిల్
క్కతో. జీతాలు వచ్చినరోజున అలా ఆ గోడల దగ్గర నిలబడి ఆ బరువు
టిపీ తూచి మూటలు గట్టిపెడుతుంది - పాలమనిషికింత, కూరలబ్బికింత -
లికింత, పిడకలదానికింత, పొరుగువాళ్ల కింత - అంటూ.

బాలయోగి లేచి ఆమె వెనక నిలబడ్డాడు.

ఆమె అన్నిలెక్కలూ సరిచూసుకుని, మళ్ళీ అందరి బాకీలూ వరసగా
మొత్తం కూడుకుంటోంది. కూడిక పూర్తిచేసి గుండెమీద చేయి
కుని 'అమ్మో! ఇంతయిందా!' అంది బెంగగా.

ఆమె బెంగలో యింకొంచెం బరువు వేశాడు బాలయోగి. 'నీ కూడిక
) అమ్మా! ఇంకా ఇరవై రూపాయలు ఎక్కువ రావాలి! పదుల
ంలో రెండు వేసుకోవటం మరిచిపోయావు.'

ఆమె మళ్ళీ కూడింది. మరోసారి కూడింది. 'ఔను....' అంది.
ంతే ఆ సంఖ్యను దిద్దకుండా అలాగే నిలబడిపోయింది. ఆమె చెయ్యి
పోయింది.

మరో నిమిషం అలాగే పిచ్చిదానిలా గోడలపైపు చూచి. గొణు
ంటూ వెళ్ళి రాజా పక్కన మేనువాల్చింది. 'పడుకుని నిద్రపోరాదట్రా?'
చిరచిరలాడుతూ.

బాలయోగి పడుకుని ముసుగుతన్నాడు. పడుకున్న వెంటనే రాదు
వాడికి. పడుకున్న తరవాత చాలాసేపు ఆలోచనల్లో కొట్టుకుపోతాడు.
లోచనల్లోనే నిద్రపోతాడు.

పక్కన నిద్రపోతున్న రోజారమణి కిలాకిలా నవ్వింది—శృతిపెట్టిన
ుద ఎలుక దూకి తంత్రులు మోగినట్లు!

బాలయోగి ముసుగు తొలగించాడు. పక్కకు పొర్లి చెల్లెలి ముఖం

లోకి వంగి చూశాడు. మంచంలో ముడుచుకున్న మొగ్గలా నిద్రపోతోంది రోజా.

మెల్లగా పిలిచాడు, 'రోజా!'

'ఊఁ!'

'ఎందుకే నవ్వుతున్నావు?'

'కొత్త గౌను....' నీటిలోంచి ఛెంగున పైకి గెంతి మళ్ళీ లోపలికి జారిపోయే బంగారు చేపలా - ఆమె పెదాలమీద లాస్యం చేసింది ఆ ఒక్క మాటే!

'ఎవరిచ్చారు కొత్తగౌను?' అని అడిగాడు మళ్లీ.

రోజాకు ఆ మాట వినిపించినట్లు లేదు. హాయిగా నిద్రపోతోంది.

ఇంకా ఏమైనా చెబుతుందేమోనని కాస్సేపు చూసి, వెనక్కి వాలాడు బాలయోగి.

వెర్రినాగమ్మ! కొత్తగౌను తొడుక్కుంటోంది. కలల్లో!

కలలు!

కంటినిండా కలలు!

బ్రతుకునిండా కలలు!

కళ్లు మూతలు పడగానే కొల్లలుగా ముసురుకునే కమ్మని కలలు!

కళ్లు తెరవగానే కోసెడుదూరం పారిపోయి కోతిలా వెక్కిరించే కల్లబొల్లి కలలు!

బాలయోగి ఆలోచనలు బజారులోకి పరుగుతీశాయి. ఈ యింట్లో లేనివన్నీ అక్కడే వున్నాయి—మూటలు మూటలుగా, రాసులు రాసులుగా, బారులు బారులుగా, దొంతర్లు దొంతర్లుగా, తాను తాన్లుగా, బేళ్ళు బేళ్ళుగా!

అక్కడికీ యిక్కడికీ ఎంత తేడా!

ఆ బజారునిండా వెలలే!

ఈ యింటినిండా కలలే! ఈ యింటిలోని కుండలనిండా, డబ్బాలనిండా, పాతట్రంకులనిండా, ఓటి సీసాలనిండా, చిల్లి జేబులనిండా—కిటకిటలాడుతున్న కలలే!

దొంతులన్నీ ఖాళీ। డబ్బాలన్నీ ఖాళీ।
ఈ యింట్లో చారెడు బియ్యం వుండదు.
సోలెడు పప్పు వుండదు.
పెరట్లో వున్న ఓటి సబ్బుపెట్టెలో సబ్బుబిళ్ల వుండదు.
అందరి బట్టలకూ చిరుగులే।
దండెంమీద వేలాడుతూన్న మోపెడుబట్టలూ పనికిరానివే।
పడుకోటానికి మంచి చాపలేదు.
కప్పుకోటానికి మంచి దుప్పటిలేదు.
నీళ్లు పోసుకుంటే తుడుచుకోవటానికి తువ్వాలులేదు.
ఈ ఇంట్లో మట్టికడవలే ఇత్తడి బిందెలు।
చిల్లులుపడిన సత్తుగిన్నెలే స్టీలుపాత్రలు।
అమ్మ చెవులకు అరిగిపోయిన రోల్డుగోల్డు కమ్మలు।
అకా చెవులకు అదికూడా లేదు।
కంటినిండా కలలు!
గుండెనిండా గుబులు।
బాలయోగి కళ్లు మూతలుపడ్డాయి.
వాడి ఆలోచనలు–ఆవలించాయి.
గిరగిర గిరగిర....
ప్రపంచం తిరుగుతూంది।

....ఇదే ఆసియాఖండము. ఇదిగో భారతదేశము. అందులో బాల వాళ్ల యిల్లు యిదే। దీనికి భారత ఎడారి అని పేరు. ఇచ్చట వర్షపా తక్కువ. పంటలు పండవు. ఇచ్చటి ప్రజలు కష్టజీవులు.... ప్రభుత్వము ·రిని నందనవనముగా మార్చుటకు .... ప్రభుత్వము....నందనవనము....
...

బాలయోగి నిద్రపోయాడు.

* * *

వేకువజామున మెలకువ వచ్చింది బాలయోగికి.

రాజా లేచి కూర్చుని గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

ఎవరూ పట్టించుకోవటంలేదు.

అందరూ నిద్రపోతున్నారు, మండుతూన్న కాష్టంమీద పడుకున్న
ుగుల్లా.

ఆ యింట్లో అందరూ వేకువజామున ఒళ్లుమరిచి నిద్రపోతారు. ఆ
ుయంలో పిడుగులుదొర్లినా పైకి లేవరు.

రాజా దగ్గరికి లేచివెళ్లాడు బాలయోగి.

దుప్పటి తడిపేసుకుని, చలికి ఏడుస్తున్నాడు రాజా.

దుప్పటి చివరలు రెండూ తారుమారు చేసి తిరగేశాడు బాలయోగి.
ప్పుణ్ణి పడుకోబెట్టి దుప్పటి సర్ది, వాణ్ణి చిచ్చికొట్టాడు.

కాస్సేపటికి నిద్రపోయాడు రాజా.

బాలయోగి లేచి వెళ్లి తన స్థానంలో పడుకున్నాడు.

కడుపులో ఆకలి!

నరాల్లో చలి!

తనవైపు తిరగేసుకున్న తడిదుప్పటి కప్పుకోటానికి పనికిరావటం
ు.

తడి తగలకుండా దూరంగా ఒత్తిగిలాడు.

ఎముకల్ని కొరికేస్తూంది చలి.

కడుపులో కాళ్లు ముడుచుకుని, చేతుల్లో ముఖం దాచుకున్నాడు.

లాభంలేదు.

చలి కొరికేస్తోంది, పాముకోరల్లా!

చలి కోసేస్తోంది, రంపంపళ్లలా!

అబ్బబ్బ! ఈ ప్రపంచంలో బ్రతకటం యెలా? చోటు చాలదు!
చాలదు! ఉంటానికి యిల్లు చాలదు! తింటానికి తిండిచాలదు! కట్టుకో
ుకి గుడ్డ చాలదు! కప్పుకోటానికి దుప్పటి చాలదు!

చాలీచాలని ప్రపంచం! మట్టి మూకుడులో సంగటి ముద్దలాంటి ప్రపంచం! తడిసిపోయిన దుప్పటిలాంటి ప్రపంచం! తాడుచాలని బొంగరంలా—తల్లకిందులుగా తిరుగుతోంది!

గిరగిర గిరగిర గిరగిర గిరగిర

నేలా నీళ్ళూ-గాలీ ధూళీ-మబ్బూ వానా-కొండా కోనా-వాగూ వంకా-చెట్టూ చేమా-చెరువూ దొరువూ - గొడ్డూ గోదా-గడ్డీ గాదం గిరగిర గిరగిర గిరగిర గిరగిర....

ఊరూ నాడూ-పల్లె పట్నం-మిట్టా పల్లం-మేడా గోడా-గిరగిర - గిరగిర-గిరగిర గిర-గిర ....

ముసలీ ముతకా-పిల్లా పీచూ-గోచీ గిన్నె - కొంపా గంపా - గిరగిర గిరగిర గిరగిర గిరగిర ....

....బాలయోగి కళ్లు గిరగిరా తిరిగాయి. కళ్లు గట్టిగా మూసుకున్నాడు మూతలుపడిన కళ్ళలో ప్రపంచం గిర్రున తిరుగుతోంది.

ప్రపంచం నిండా జనం! ఒడ్డును ఒరుసుకుంటూ పారే ప్రవాహంలా కదిలిపోతున్న జనం! ఒకరినొకరు నెట్టుకుంటూ-తోసుకుంటూ-ఒరుసుకుంటూ అడ్డు పడుతూ-పక్కకు తప్పుకుంటూ-ఆగుతూ - సాగుతూ - అయస్కాంతం వైపు ఆకర్షింపబడే ఇనుపసూదుల్లా అంగళ్ల వైపు అంగలువేస్తున్న జనం!

తోసుకుంటూ-తొక్కుకుంటూ-కుమ్ముకుంటూ - కొట్టుకుంటూ - నెట్టుకుంటూ-తిట్టుకుంటూ - పంచెలు జార్చుకుంటూ - చొక్కాలు చింపుకుంటూ - జుత్తు పీక్కుంటూ-చొంగలు కార్చుకుంటూ-చెప్పులు తెంపుకుంటూ-చెమటలు కార్చుకుంటూ-భుజాలమీద నడిచిపోతూ-తలకాయలమీద దొర్లిపోతూ-ప్రాణాలను పణంగాపెట్టి, టిక్కెట్లకోసం, సరకులకోసం విరగబడిపోతున్న జనం!

బాలయోగి తల తిరిగిపోయింది.

గిరగిర గిరగిర గిరగిర గిరగిర ....

వాడి గుండెలోంచి సన్నటి ఏడుపు రెక్కలార్చుకుంటూ గొంతులోకి ఎక్కివచ్చింది, అప్పుడే గొంతు విప్పుకున్న కాకిపిల్లలాగా! ★